# అల్లూరి సీతారామరాజు

అల్లూరి సీతారామరాజును గురించి వినని వారు ఆంధ్రదేశములో ఉండరు అనేది అతిశయోక్తి కాదు. కాని సీతారామరాజును గురించి చాలా మందికి తెలిసినది విప్లవవీరునిగా ఆంగ్లేయులను ఎదిరించిన విషయము మాత్రమే! కాని అతనికి స్ఫూర్తి నిచ్చిన వారు, గ్రామ ప్రాంతాలలో పరిస్థితిని అర్థము చేసుకోడానికి అతను పడిన శ్రమ, ఆంగ్లేయులతో పోరాటానికై అతను మన్యప్రజలను ఒక త్రాటిపై నడిపించడానికి చేసిన కృషి, వారికి ఆయుధ శిక్షణ ఇచ్చిన పద్ధతి ఎంత ప్రశంసించినా తక్కువే. ఈ విషయాలను అవలోకించడానికి చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసము.

రామరాజు ఒక వ్యక్తి కాదు - సామూహిక శక్తి. మన్యప్రజలకు ప్రాణం. ఆంగ్లేయులకు సింహస్వప్నం. విప్లవానికి అర్థము - మానవతకు నిలువెత్తు విగ్రహము సీతారామరాజు. ఒక్కమాటలో న్యాయానికి మిత్రుడు - అన్యాయానికి శత్రువు.

1897 వ సంవత్సరము జులై 4వ తేదీన వెంకట రామరాజు, సూర్యనారాయణమ్మగార్లకు పాండ్రంకిలో (సూర్యనారాయణమ్మగారి పుట్టినింట్లో) జన్మించిన ప్రథమ సంతానమే రామరాజు. ఫోటోగ్రాఫరుగా మంచిపేరున్న వెంకట రామరాజు లాల్ బాల్ పాల్ గా ప్రసిద్ధులైన లాలాలజపతిరాయ్, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్‌ల ఫోటోలను తీసే అవకాశము, వారి ఉపన్యాసము వినే భాగ్యము కలిగింది. రామరాజుకు దేశభక్తిని, స్వతంత్ర భావాలను కలుగజేసిన వెంకట రామరాజు 1908 వ సంవత్సరము కలరా బారిన పడి మరణించాడు. చిన్నతనమునుండి గుఱ్ఱపుస్వారీ, యోగాభ్యాసములపై శ్రద్ధతో చదువుపై ఆసక్తి కనబరిచేవాడు కాదు. నాటకాలలో నటించడము చాలా ఇష్టపడేవాడు. ఇంగ్లీషు భాషపై ఇష్టము ఉండేదికాదు. అయిదవ జార్జి చక్రవర్తి పట్టాభిషేక వార్షికోత్సవము సందర్భముగా ప్రదర్శించిన 'శశిరేఖా పరిణయము' నాటకములో శశిరేఖ, నారద పాత్రలను అద్భుతముగా పోషించి, పొందిన పతకాన్ని ధరించి, "తెల్లవాడు మన గుండెపైనెక్కి కూర్చున్నాడు - ఆ విషయాన్ని విస్మరించకుండా ఈ పతకాన్ని ధరిస్తున్నాను" అని అన్నాడట.

1912 వ సంవత్సరము విశాఖపట్టణములో ఏ.వి.యన్. కళాశాలలో చదువుకొంటున్న సమయములో 'సీత' అనే పేరుగల ఓ యువతిని ప్రేమించి, ఆమె ప్రేమను పొందలేని కారణముగా, ఆమె పేరును తన పేరు ముందు చేర్చి 'సీతారామరాజు'గా మార్చుకున్నట్లు చెబుతారు. తపస్సు చేసుకోవడానికి అనువైన ప్రదేశము కోసము వెదికేవాడు. కృష్ణదేవుపేట (నేడు కె.డి.పేటగా పరిచితమైన ఊరు), నర్సీపట్నము మొదలైన ప్రదేశాలు తిరిగాడు. అంతేకాక జోతిష్య శాస్త్ర అధ్యయనము, వాస్తు శాస్త్ర అధ్యయనము, సంస్కృతము, ఆయుర్వేదము, ప్రాణాయామములను సాధన చేసాడు. తదనంతరము ఉత్తరభారత యాత్ర చేయాలని సంకల్పించాడు. 1916 వ సంవత్సరము ఏప్రియల్ నెలలో మొదలిడిన పాదయాత్ర - కలకత్తాలో మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్ దాస్, మదన మోహన మాలవ్యా, సురేంద్రనాథ్ బెనర్జీలను కలిసే అవకాశాన్ని ఇచ్చింది.

అక్కడి నుండి కాశీ, అమృతసర్, ఉజ్జయిని, హరిద్వారం, నేపాల్, బదరీనాథ్, ఆగ్రా, సిమ్లా, పూనా, బొంబాయి మొదలైన ప్రదేశాలు సందర్శించాడు. తిరిగి 1918లో మళ్ళీ యాత్రకి వెళ్ళి, తిరిగి కె.డి.పేట చేరి, అక్కడి ప్రజలకు ఎన్నో విషయాలలో మార్గనిర్దేశాన్ని చేసాడు. వారిలో చాలా మందిని దురలవాట్లకు దూరము చేసాడు. ధనుర్విద్య, తుపాకి ప్రయోగించడము, బల్లెం విసరడము, కత్తి సాము మొదలైనవి సాధన చేసాడు. గొరిల్లా యుద్ధములో సహజమైన నేర్పు గలవాడు కావడము కూడా తరువాత ఆంగ్లేయులపై అతని పోరులో చాలా ఉపకరించింది.

పోలీసులవలన, అడవిలోని అధికారులవలన మన్య ప్రజలకు బాధలు ఎక్కువగా ఉండేవి. అధికారులు ధనము చెల్లించకుండానే సరుకులను ప్రజలనుండి తీసుకునేవారు. దీనివలన వారి శ్రమకు ఫలితముండేది కాదు. ప్రజల మాన, ప్రాణాలతో ఆడుకోవడము అధికారులకు నిత్యకృత్యమయింది. ఈ పరిస్థితిని అవగాహన చేసుకొన్న సీతారామరాజు మన్య ప్రజలలో ధైర్యసాహసాలను పెంచేందుకు ఎంతో కృషిచేసాడు. క్రమముగా రామరాజును ప్రజలు దైవ సమానుడిగా భావించేవారు. భగత్ సింగ్, రాజగురు, ఆజాద్, లాల్ బాల్ పాల్ మొదలైన వారి బాట రామరాజుకు పదనిర్దేశము చేసింది. రామరాజు నిర్విరామ కృషితో మన్య ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేసాడు. వారివారి శౌర్యపరాక్రమములను బట్టి బాధ్యతలను అప్పగిస్తూ, సామాన్య ప్రజలను, వృద్ధులను చారులుగా ఉపయోగించుకుంటూ వ్యూహరచన చేసాడు. మన్యప్రజలకు రామరాజు మాట దైవాజ్ఞతో సమానము. చింతపల్లిలో ఒక చిన్న గ్రామములో గంటందొర, మల్లుదొర అనే ఇద్దరు అన్నదమ్ములు నీతిగా, న్యాయముగా వారి కర్తవ్యాన్ని సక్రమముగా నిర్వహిస్తుండగా, అప్పుడు తహసీల్దారుగానున్న బాస్టియన్ దొర దురాగతాల కారణముగా వారు కష్టాలకు లోనై అసంతృప్తితో ఉన్నారు. సరియైన నాయకుడులేని కారణముగా వారి కష్టాలను, బాధలను దిగమ్రింగుకుని దొరలు పెట్టే బాధలను సహిస్తూ ఉండేవారు. అదే సమయములో రామరాజు వారికి తారసపడడము వారికి కొండంత బలాన్నిచ్చింది. రామరాజు అండతో వారు అన్యాయాన్ని ఎదిరించడము అలవరచుకున్నారు. బాస్టియన్ దొర అన్యాయమునకు బలియైన కంకిపాటి పడాలు అనబడే మరియొక వ్యక్తి కూడా వీరికి చేరువై, బాస్టియన్ దురాగతాలను తెలియజేస్తూ విశాఖపట్టణము కలెక్టరుకు వినతిపత్రము సమర్పించారు. కలెక్టరు బాస్టియన్ దొరను మందలించడము వలన బాస్టియన్ దొర రామరాజుపై కక్ష సాధించదలచుకున్నాడు.

రామరాజుపైన ద్వేషము పెంచుకున్న బాస్టియన్ దొర, రామరాజుపై ఉన్నవి లేనివీ కల్పించి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసాడు. మన్యప్రాంతములో విప్లవానికి బీజాలు పడుతున్నాయని, వాటిని ఆదిలోనే త్రుంచకపోతే ముప్పు తప్పదని హెచ్చరికలు పంపాడు. రామరాజు మన్యప్రజలను బానిస బ్రతుకులనుండి విముక్తి కలిగించడమే ధ్యేయముగా సన్నద్ధుడు కాసాగాడు. ఈ కారణముగా 1922 వ సంవత్సరములో రామరాజును విప్లవమార్గము నుండి తప్పించడానికి ప్రభుత్వ అధికారులు 30 ఎకరాల భూమిని, భూమిని దున్నడానికి అవసరమైన ఎడ్లను, రామరాజుకు అవసరమైన పాలకొరకు ఓ ఆవును ఇచ్చారు. రామరాజు దినచర్యలపై గట్టి నిఘా ఏర్పాటు చేసారు. తనకివ్వబడిన పొలములో పండిన ఫలాల్ని, పంటను అన్నార్తులకోసమే వినియోగించేవాడు. కొంతకాలానికి రామరాజు ప్రవర్తన ప్రమాదకరముగా లేదని తలచి అతనిపై నిఘా తొలగించబడింది. కాని రామరాజు తన ప్రయత్నములు రహస్యముగా కొనసాగిస్తూనే ఉండేవాడు. విప్లవదళములో సభ్యులు సాయుధవర్గము,

నిరాయుధవర్గములుగా విభజించబడి (కత్తియుద్ధము, ధనుర్విద్యలలో నిపుణులు మొదటి కోవలోకి, చారులుగా రహస్య సమాచారసేకరణ చేసేవారు, ప్రమాద హెచ్చరికలు తెలియజేసేవారు రెండవ కోవలోకి వస్తారు) క్రమశిక్షణతో మెలిగేవారు. వీరికి వేగిరాజు సత్యన్నారాయణరాజు (అగ్గిరాజు), మరి కొంతమంది వీరులు జతకూడడముతో విప్లవవీరుల సంఖ్య మరింత పెరిగింది.

1922 ఆగష్టు 22 వ తేదీన విప్లవవీరులు తొలిసారిగా రంపచోడవరం ఏజెన్సీలోని చింతపల్లి గ్రామ పోలీస్ స్టేషన్ ని చుట్టుముట్టారు. ఆ పోలీస్ స్టేషన్ లోని ఆయుధసామాగ్రిని వశపరచుకొని, ఆ ఆయుధములను వశపరచుకొన్నట్లు జాబు వ్రాసి, ప్రజలపై నున్న నేరారోపణ పత్రాలను చించివేసి వారి తొలి విజయాన్ని నమోదు చేసుకున్నారు. మరుసటి రోజునే కృష్ణదేవుపేట (కె.డి.పేట) పోలీస్ స్టేషన్ లోని ఆయుధాలను చేజిక్కించుకున్నారు. ఆగష్టు 24వ తేదీన రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్పై దాడి చేసి ఆయుధాలను, పోలీసు దుస్తులను స్వాధీనపరచుకోవడమే గాక, బందీగానున్న విప్లవవీరుడు వీరయ్యదొరని విడిపించి మరో విజయాన్ని సొంతం చేసుకున్నారు. వీరయ్య తరువాత రామరాజు ముఖ్య అనుచరునిగా స్థానాన్ని సంపాదించుకున్నాడు. రెట్టించిన ఉత్సాహముతో ప్రభుత్వాధికారులకు చెమటలు పట్టించే విధముగా బాణమునకు మిరపకాయ, ఓ ఉత్తరము కట్టి మిరపకాయ టపాలను పంపేవారు. ఆ ఉత్తరములో వారు చెయ్యబోయే కార్యక్రమాలను ముందుగానే తెలియబరచేవారు. క్రమముగా విప్లవవీరులను పట్టి ఇచ్చినవారికి గాని, వారి ఆచూకీ తెలిపినవారికి గానీ బహుమతులను ప్రకటించారు. అయినా ప్రజలు వారి ఆచూకీ తెలిపేవారు కాదు. వారిని చిత్రహింసలు పెట్టినా వారు ఆ విషయము మాత్రమూ చెప్పేవారు కాదు. ఎంతో మంది అధికారులు ప్రాణాలను కోల్పోయారు. 1922 అక్టోబరు 15వ తేదీన ముందుగా తెలిపి, అడ్డతీగల స్టేషన్ ను చుట్టు ముట్టగా పోలీస్ జవానులు పారిపోవడము విప్లవవీరుల విజయానికి తిరుగులేకుండా పోయింది. అక్టోబరు 19 వ తేదీన రంపచోడవరం స్టేషన్ ను ముట్టడించారు. కాని ఆయుధములు విప్లవవీరులకు అందకుండా అధికారులు వాటిని రహస్య ప్రదేశాలలో దాచివేసారు.

పెదగడ్డపాలెంలో ఉండి, పోలీసుల వివరములకొరకు పంపిన రామరాజు గూఢచారి పోలీసుల చేతికి చిక్కడముతో, అధికారులు రామరాజును తప్పించుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసారు. ఆ రోజు అచటనున్న అతి తక్కువ మంది విప్లవవీరులతో పెద్దసైన్యాన్ని ఎదిరించడము కష్టమైన తరుణములో యుద్ధము అనివార్యమయింది. అయినప్పటికి విప్లవవీరులు ఎంతో వీరోచితముగా పోరాడి నలుగురు వీరమరణము పొందగా, మిగిలినవారు తప్పించుకున్నారు. కొన్ని ఆయుధాలను వదిలివేయడము జరిగింది. ఈ విధముగా విప్లవవీరులు తొలి పరాజయాన్ని చవిచూసారు. డిశంబరు 6 వ తేదీ విప్లవవీరులకు దుర్దినం. దీనితో ఆంగ్ల సైనికులలో ఉత్సాహము పెరిగింది. తరువాత ఆంగ్ల సైనికుల దాడుల్లో మల్లుదొర, అగ్గిరాజులు ప్రాణాలతో పట్టుబడి పోవడముతో విప్లవవీరుల సమరానికి ఆటంకము కలిగింది. ఇదే అదునుగా సైనికులు, అధికారులు మన్య ప్రజలను హింసలకు గురిచేస్తూ ఉండడమువల్ల రామరాజు విచారగ్రస్తుడైయ్యాడు. తనకారణముగా మరిన్ని ప్రాణములు పోవడము సహించలేక, తన ఆచూకీ చెప్పి బహుమతిని పొందమని ప్రజలను అడుగగా, రామరాజును ప్రాణానికి సమానముగా భావించే వారు అందుకు నిరాకరించారు.

1924 మే 7 వ తేదీన యేటి ఒడ్డున స్నానం చేస్తుండగా, విషయము తెలుసుకున్న ఆంగ్ల సైనికులు అతన్ని చుట్టుముట్టారు. నిరాయుధుడైన రామరాజును బంధించి, మేజర్ గుడాల్ ఎదుట హ-జరు పరిచారు. రామరాజు ధైర్య సాహసములు విన్న గుడాల్ రామరాజును విడిపించి, కరచాలనము చేయ ప్రయత్నించాడు. రామరాజు దానికి నిరాకరించాడు. ఆంగ్ల సామ్రాజ్యాన్ని, ఆంగ్లేయులను నిందించాడు. కోపముతో గుడాల్ రామరాజును గొలుసులతో చెట్టుకి బంధించి, నిర్ధాక్షిణ్యముగా కాళ్ళనుండి పైకి కాల్పులు సాగించాడు. నెత్తురు ధారా పాతముగా కారుతున్నా రామరాజు మాతృదేశాన్ని స్మరించడము మానలేదు. 'వందేమాతరం' అంటూ నిశ్చలముగా తన మాతృదేశాభిమానాన్ని చాటుకున్నాడు. శరీరము చిన్నభిన్నమైన రాజును గుడాల్ నాభివద్ద గురిపెట్టగా, "అక్కడ కాదు చంపదలచుకుంటే ఇక్కడ కాల్చు" అని తన వక్షస్థలాన్ని చూపిన వీరుడు అల్లూరి. గుడాల్ రామరాజు గుండెకు గురిపెట్టి పేల్చివేశాడు. 27 సంవత్సరాల వయస్సులోనే రామరాజు ప్రాణములు అనంతవాయువులలో కలసిపోయాయి. త్రికాలాలలో కూడా అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగము అనిర్వచనీయము. అలాంటి వీర పుత్రుని గన్న ఆంధ్రదేశము ధన్యము.

*** *** ***